RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 10 సెప్టెంబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:89

## ఫాంహౌస్‌లో కుట్రపై సమగ్ర విచారణ: సీఎం రేవంత్‌రెడ్డి



శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చోటుచేసుకున్న కుట్రపూరిత సంఘటనల విషయంలో బాధ్యులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపించి, క్రిమినల్ కేసులు నమోదు చేసి దోషులను శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో వెల్లడించారు.

శాసనసభ సమావేశాల తొలిరోజు స్పీకర్ గారిని ఉద్దేశించి దుర్భాషలాడిన ఉదంతం, దళితులు నడిచిన నేలను శుద్ధి చేసిన సంఘటనలపై యావత్ శాసనసభ ఆందోళన వ్యక్తం చేసింది. సభాపతి గారిని అవమానపరుస్తూ, జరిగిన దురదృష్టకర సంఘటన విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి అసెంబ్లీ అండగా నిలిచింది. ఈ దురదృష్టకర సంఘటనల్లో మానసిక ధైర్యం కోల్పోవద్దని స్పీకర్ గారికి విజ్ఞప్తి చేసింది.

ఈ అంశాలపై బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చపై సభా నాయకుడు, ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. ఈ విషయంలో స్పీకర్‌కి ప్రభుత్వం అండగా నిలబడుతుందని చెప్పారు. సభాపతి మనసును గాయపరిచిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

“ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతి స్థానాన్ని అవమానించేలా వ్యవహరించారు. శాసన సభాపతి తల్లి ని అవమానించారు” అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

దేశంపై దాడికి ప్రయత్నించిన ఉగ్రవాదులు, తీవ్రవాదులకు శాసనసభ ప్రాంగణంలో సభా అధ్యక్షుడిని అవమానిస్తూ మాట్లాడిన మాటలకు ఏమాత్రం తేడా లేదన్నారు. ఒక పథకం ప్రకారం దుర్మార్గమైన ఆలోచనతో జరిగిన దాడిగా ఈ సంఘటనను అభివర్ణించారు.

“మన మాతృస్వామ్య సమాజం. స్త్రీని అపరకాళి, భద్రకాళి, భూమాత, భారతమాత, తెలంగాణ మాత అని పిలుస్తాం. ఏదైనా శక్తిని, గొప్పతనాన్ని ఆపాదించాలని, చర్చించాలని అనుకున్నప్పుడు తల్లితో పోలుస్తాం. మహిళతో పోలుస్తాం. మహిళను పూజించే మన సమాజం ఈ దేశాన్ని భారతమాత అని మహిళతో పోల్చుకుంటాం. రాష్ట్రాన్ని తెలంగాణ తల్లితో పోల్చుకుంటాం. అలాంటి ఈ తెలంగాణ నేల మీద ఒక తల్లిని అవమానించే విధంగా ప్రవర్తించడం దారుణం” అని ఆందోళన వ్యక్తం చేశారు.

సభాపతి కి జరిగిన అవమానం సమాజానికి జరిగినట్టే. దోషులను తెలంగాణ సమాజం ఉపేక్షించదు. రజాకార్లను దిగంతాలకు తరిమి మట్టికరిపించిన చరిత్ర ఈ గడ్డది అని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలియజేయడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. కానీ సభాపతి మనసుకు గాయం చేయాలన్న ఆలోచన బరితెగించి మాట్లాడారని అన్నారు. సభాపతి ని అవమానించిన వారిని చట్టపరంగా శిక్షించే విషయంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుందని చెప్పారు.

సెప్టెంబర్ 7వ తేదీ నుంచి శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని ప్రభుత్వం భావించింది. విద్యారంగానికి సంబంధించిన సమస్యలు, ధరణిలో జరిగిన అక్రమాలు, 22 (ఎ) వంటి అంశాలే కాకుండా ప్రతిపక్షాలు లేవనెత్తిన చాలా అంశాలను చర్చించాలని భావించాం. ప్రజా సమస్యలపై చర్చ జరగకూడదని అడ్డుకున్నారు” అని ముఖ్యమంత్రి అన్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఉప ముఖ్యమంత్రి , మంత్రులు, ఎమ్మెల్యేలు



హైదరాబాద్, సెప్టెంబర్ 9, 2026: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో మంత్రులు శ్రీ దామోదర రాజనర్సింహ, శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీమతి సీతక్క, శ్రీ మహ్మద్ అజహరుద్దీన్, శ్రీ వివేక్, శ్రీ లక్ష్మణ్ కుమార్, శ్రీ వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు శ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రీ వెద్మ బొజ్జు పటేల్ తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో బుధవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు.

## తెలుగు రాష్టాలకు రైల్వే శుభవార్త.. కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం



రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.

కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029–30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది.

## 80 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కుల వివక్ష, అంటరానితనం వంటి అనాగరిక ఆలోచనలు కొనసాగడం బాధాకరం భట్టీ



ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న కార్యక్రమ ప్రాంగణాన్ని శుద్ధి చేయడం దేశాన్ని అవమానించే చర్య. ఇంతటి ఘటనను బీజేపీ ఖండించకపోవడం మరింత బాధాకరం.

ఇదే వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజం ఆత్మగౌరవం కోసం పోరాడింది. శ్రీమతి సోనియా గాంధీ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర పునాదులే సెల్ఫ్ రెస్పెక్ట్, ఆత్మగౌరవం, సమానత్వం.

అటువంటి తెలంగాణ శాసనసభకు సభాపతిగా ఉన్న గౌరవ గడ్డం ప్రసాద్ కుమార్ ని అవమానించడం అంటే కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు---యావత్ సభను, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించడమే.

తెలంగాణ సమాజం వివక్షను, ఫ్యూడల్ అహంకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు.

కులం, పుట్టుక ఆధారంగా మనిషిని అవమానించే రాజకీయాలకు దేశంలో, తెలంగాణలో స్థానం లేదు అధ్యక్షా.

## E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

### E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్

### తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి

### ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు



ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు.

ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు.

“ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు” అని ఆయన వివరించారు.

ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు.

గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.



పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా న్యూస్ పేపర్ జేఏసీ అధ్యక్షులు కేసరి వెంకటేశ్వరరావు పాల్గోని మట్టి గణపతి ప్రతిమను అందుకున్నారు

# ప్రజాబలం

10 సెప్టెంబర్ 2026 గురువారం


## వ్యవసాయానికి డేంజర్ బెల్స్...

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బుల్లో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

## సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాద్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్ తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు

## హాస్టల్ నిర్వాహకులకు 3 నెలల గడువు

**-జనవరి 1వ తేదీ నుంచి హైడ్రా తనిఖీలు**
**-ప్రమాదాల నివారణకు హైడ్రా చర్యలు**
**-భద్రత విషయంలో రాజీలేదన్న హైడ్రా కమిషనర్**






హాస్టళ్లలో ఉన్న వారి భద్రత విషయంలో రాజీ పడమని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. ప్రమాదకరమైన భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటిష్టమైన కట్టడాలతో పాటు అన్ని అనుమతులున్న భవనాల్లోనే హాస్టళ్లు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకరమైన భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నవారు పటిష్టమైన భవనాల్లోకి వాటిని తరలించాలన్నారు. ఇందుకు గాను 3 నెలల గడువును నిర్దేశించారు. వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహిస్తామని.. కూలే ప్రమాదమున్న భవనాలను తొలగిస్తామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలి ఇద్దరు దుర్మరణం పాలవ్వడం, పక్కనే ఉన్న భవనాలు దెబ్బతినడం.. అలాగే దేశ రాజధానిలో ఈ నెల 6వ తేదీన ఓ హాస్టల్ భవనం కుప్పకూలి ఏడుగురు చనిపోవడం.. పలువురికి గాయాలైన ఘటనల నేపథ్యంలో హైడ్రా మరింత అప్రమత్తమైంది. నగరంలోని హాస్టళ్ల నిర్వాహకులతో పాటు.. వాటిని అద్దెకిచ్చిన భవన యజమానులతో బుధవారం హైడ్రా కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. చదువులతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ నగరంలో వివిధ హాస్టళ్లలో నివాసముంటున్న వారి భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. హాస్టళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, భవన నిర్మాణ పటిష్టత వంటి అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు.. ప్రమాదం జరగకుండా చూడాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని గుర్తు చేశారు.

**-మూడు కార్పొరేషన్లతో సమన్వయంగా తనిఖీలు..**

??అనుమతి లేని భవనాల్లో హాస్టళ్ల నిర్వహించడంపై మూడు కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుని తనిఖీలు, తదుపరి చర్యలు చేపడతామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. తక్కువ ఫీజులు వసూలు చేసి హాస్టళ్లలో ఉంటున్నవారి ప్రాణాలకు ముప్పు తేవద్దన్నారు. హాస్టల్‌లో పిల్లలకు మంచి వసతి, పూర్తి భద్రత కల్పించాలని.. డబ్బు కోసం భద్రతను పక్కన పెట్టొద్దన్నారు. హాస్టళ్లలో మీ పిల్లలే ఉంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో అదే విధంగా నిర్వాహకులు ఆలోచించాలన్నారు. హాస్టల్ నిర్వహణకు ఓ భవనాన్ని ఎంచుకునే ముందు.. అగ్ని ప్రమాదం జరిగితే అందులో ఉన్న వారు సులభంగా బయట పడగలరా అనేది చూసుకోవాలి. అలాగే ఆ భవనం పటిష్టంగా ఉందా.. తగిన పార్కింగ్ సౌకర్యం ఉందా అనే విషయాలను సరి చూసుకోవాలి. 50 గజాల్లో 7 అంతస్తుల భవనాలు నిర్మిస్తే వాటిని సూసైడ్ బాంబర్లుగా పరిగణించాల్సి వస్తుందన్నారు. వీటితో పక్కన ఉన్న భవనాల భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే గచ్చిబౌలిలోని ఆంజయ్యనగర్‌లో కుప్పకూలిన భవనం పక్కనే అంతే ప్రమాదంగా ఉన్న భవనాలను ఆరింటిని తొలగించామన్నారు. పక్కనే ఉన్న సిద్ధిక్ నగర్‌లో కూడా 2024లో ఓ భవనం పక్కకు ఒరిగిన విషయాన్ని గుర్తు చేశారు. నగర వ్యాప్తంగా కొన్ని హాస్టళ్లను తనిఖీ చేయగా.. చాలావరకు నిబంధనలను ఉల్లంఘించినట్టు రుజువైందన్నారు. భవనాల్లో అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి. వాటి నివారణకు ఎలాంటి నిబంధనలు పాటించాలి. అనుమతి లేని, కాలపరిమితి దాటిన కట్టడాలతో పొంచి ఉన్న ముప్పును హైడ్రా అదనపు డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య గారు వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను చూపించి జాగ్రత్తలను సూచించారు.

## దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీ వైఖరిని ప్రజల ముందు ఎండగడతాం

### ఎంపీ, మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్: దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీ వ్యవహరించిన తీరును ప్రజల ముందు ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తొలి విడత ప్రెస్‌మీట్లు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ప్రెస్‌మీట్లలో పార్టీకి చెందిన సీనియర్ అధికార ప్రతినిధులు మాత్రమే పాల్గొని, బీఆర్ఎస్ పాలనలో దళితులకు జరిగిన అవమానాలు, వివక్షపై వివరంగా వివరిస్తారు.

ప్రత్యేకంగా అసెంబ్లీ లోపల, బయట దళితుల పట్ల బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు, రాజ్యాంగబద్ధమైన గౌరవనీయ శాసనసభ స్పీకర్‌ను వారు ఏ విధంగా అవమానించారు, అలాగే దళిత నాయకుల పట్ల చూపిన వివక్షను ప్రజలకు వివరిస్తారు.

అదేవిధంగా, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు దళిత నాయకులు వెళ్లిన అనంతరం వారి రాకను అవమానించేలా "శుద్ధీకరణ" (క్లీనింగ్ రిచువల్) నిర్వహించారనే ఆరోపణలు కూడా ప్రజల ముందుకు తీసుకువస్తాం. ఈ ఘటనలు బీఆర్ఎస్ నాయకత్వం దళితుల పట్ల అనుసరించిన వివక్షపూరిత, అవమానకర వైఖరికి నిదర్శనాలని కాంగ్రెస్ పార్టీ పేర్కొంటుంది.

ఇదే తరహాలో బీజేపీ కూడా గౌరవనీయ ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారు సందర్శించిన ప్రదేశంలో "శుద్ధీకరణ" కార్యక్రమం నిర్వహించిన ఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు ఏ పార్టీ చేసినా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. బీఆర్ఎస్, బీజేపీ రెండూ దళితుల పట్ల అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజల ముందు బహిర్గతం చేస్తూ, సామాజిక న్యాయం, సమానత్వం, దళితుల ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేస్తున్నాం.

# ఘట్‌కేసర్--కాజీపేట రైల్వే మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టుకు ఆమోదం

## ప్రధాని మోదీకి డా. బూర నర్సయ్య గౌడ్ కృతజ్ఞతలు

హైదరాబాద్, సెప్టెంబర్9 ఘట్‌కేసర్--కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల రైల్వే మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టుకు ?2,419 కోట్లతో ఆమోదం తెలిపినందుకు మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్--కాజీపేట కీలక రైల్వే కారిడార్‌లో రైల్వే సామర్థ్యం గణనీయంగా పెరగడంతో పాటు నాలుగు లైన్ల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టును సుమారు 2029--30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ప్రాజెక్టు మేడ్చల్--మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, జనగామ, వరంగల్ జిల్లాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని డా. నర్సయ్య గౌడ్ తెలిపారు.

“తెలంగాణకు ఇంతటి కీలకమైన రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టును మంజూరు చేసిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఘట్‌కేసర్--కాజీపేట రైల్వే మార్గం తెలంగాణలో అత్యంత కీలకమైన రవాణా మార్గాల్లో ఒకటి. దీని సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ప్రయాణికులు, సరుకు రవాణా వేగవంతమై రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది,” అని డా. గౌడ్ అన్నారు.

అదనపు రైల్వే ట్రాక్‌ల ద్వారా రైళ్ల రద్దీ, ఆలస్యాలు తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికుల మరియు సరుకు రవాణా రైళ్లను నడిపేందుకు అవకాశం ఏర్పడుతుంది. హైదరాబాద్--భువనగిరి--యాదాద్రి--జనగామ--వరంగల్ మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని,

అదేవిధంగా యాదాద్రి--భువనగిరి పర్యాటక అభివృద్ధికి, వరంగల్‌తో పాటు ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కాజీపేట మీదుగా తూర్పు, మధ్య భారతదేశం వైపు సరుకు రవాణా మరింత సులభతరం కానుంది.

భవిష్యత్తులో సబర్బన్, రీజినల్ రైలు సేవలను విస్తరించేందుకు కూడా ఈ పెరిగిన రైల్వే సామర్థ్యం ఉపయోగపడుతుందని డా. నర్సయ్య గౌడ్ తెలిపారు.

“తెలంగాణలో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, వికసిత్ భారత్ నిర్మాణానికి అవసరమైన కనెక్టివిటీని పెంచడంలో మోదీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. తెలంగాణకు ఈ చారిత్రాత్మక పెట్టుబడిని మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రివర్గానికి మరోసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

# వి.ఆర్. విద్యార్థి వంటి కవులు, రచయితలు కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి: మంత్రి జూపల్లి

## రవీంద్రభారతిలో ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు

## ఆర్. విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం

కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్. విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. వి.ఆర్. విద్యార్థిని మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.






కాళోజీ నారాయణరావు సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్. విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని పేర్కొన్నారు.

కాళోజీ రచించిన ‘నా గొడవ’ కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని మంత్రి అన్నారు. సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.

ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు. ‘అవతలి వారికి అర్థమవుతుందా?’ అని ముందే ఆలోచించడం ద్వారా మనల్ని మనమే తక్కువ చేసుకోవద్దని, ఈ బానిస భావన పోవాలని కాళోజీ చెప్పిన మాటలు తెలంగాణ భాషపై ఆయనకున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు.

పలుకుబడుల భాషకు పెద్దపీట

కాళోజీ దృష్టిలో భాషకు రెండు తీర్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకటి బడిపలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష అని వివరించారు. పుస్తకాల్లో, పండితుల రచనల్లో కనిపించే భాష కంటే ప్రజల నాలుకలపై సహజంగా నడయాడే పలుకుబడుల భాషలోనే నిజమైన జీవన వాస్తవికత ఉంటుందని కాళోజీ విశ్వసించారని చెప్పారు.

తన పోరాటాలన్నింటికీ కాళోజీ కవిత్వాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారని, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా ప్రజల భాషలోనే చెప్పేవారని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యాయని అన్నారు.

తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. ప్రజలు మాట్లాడే భాషే ప్రజల హృదయ భాష అని తన రచనల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి, తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు.

భాష కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులకు అలర్ట్.. బ్యాంకులు వరుసగా 4 రోజులు మూత

## సెప్టెంబర్ 11 నుంచి వరుసగా నాలుగు రోజులు బ్యాంకు సేవలకు అంతరాయం

## శుక్రవారం నాడు సమ్మె... ఆ తర్వాత రెండో శనివారం, ఆదివారం, సోమవారం వినాయకచవితి

## వారానికి 5 రోజుల పనిదినం డిమాండ్‌తో సమ్మెకు దిగిన ఉద్యోగ సంఘాలు

## చర్చలు విఫలం కావడంతో సమ్మెను యథాతథంగా కొనసాగిస్తామని ప్రకటన

## ప్రభుత్వ రంగ బ్యాంకులపై సమ్మె ప్రభావం అధికంగా ఉండే అవకాశం

దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు ముఖ్యమైన సమాచారం. సెప్టెంబర్ 11 నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం, దానికి వరుస సెలవులు జత కలవడమే ఇందుకు కారణం. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నవారు ముందుగానే తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.




వివరాల్లోకి వెళితే, తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఖఖీదీఖ) సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 11, శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేపట్టనుంది. ఆ తర్వాత రోజు సెప్టెంబర్ 12 రెండో శనివారం, సెప్టెంబర్ 13 ఆదివారం సాధారణ సెలవులు. ఇక సెప్టెంబర్ 14, సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దీంతో శుక్రవారం నుంచి సోమవారం వరకు వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి.

వారానికి 5 రోజుల పనిదినాలను అమలు చేయాలన్నది బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీనిపై 2024లోనే సూత్రప్రాయ అంగీకారం కుదిరినప్పటికీ, అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. దీంతో పాటు, సవరించిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల (ూా×) పథకాన్ని సమీక్షించాలని, పెన్షన్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాయి. ఈ విషయమై సెప్టెంబర్ 9న ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (×దీూ), ప్రభుత్వ అధికారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని అధికారులు కోరినా, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అందుకు నిరాకరించాయి.

డిమాండ్లు నెరవేరని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని యూఎఫ్ బీయూ హెచ్చరించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేసింది. ఈ సమ్మె ప్రభావం ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ూదీ×) సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై అధికంగా ఉండనుంది. ప్రైవేట్ బ్యాంకులపై ప్రభావం తక్కువగా ఉండొచ్చు.

ఈ నేపథ్యంలో, ఖాతాదారులు నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు, చెక్కుల క్లియరెన్స్, రుణ సంబంధిత పనులు వంటివి సెప్టెంబర్ 11 లోపే పూర్తి చేసుకోవడం మంచిది. అయితే, ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ (యోనో వంటి యాప్‌లు), యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని బ్యాంకులు తెలిపాయి. అయినప్పటికీ, కొన్ని ఏటీఎం కేంద్రాల్లో నగదు కొరత ఏర్పడే అవకాశం లేకపోలేదు.

# ఏపీలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు.. నీట్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు

ఆంధ్రప్రదేశ్‌లో బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఐతీ. చీ=ఖఏూ) ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గాను నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. నీట్-యూజీ 2026 పరీక్షలో సాధించిన ర్యాంకుల ఆధారంగా ఈ ప్రవేశ ప్రక్రియను నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పష్టం చేసింది.

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైంది. అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఉన్న 100% సీట్లతో పాటు, ప్రైవేట్ మైనారిటీ, నాన్-మైనారిటీ నర్సింగ్ కళాశాలల్లోని కేటగిరీ ‘ఏ’ కిందకు వచ్చే 60% సీట్లను భర్తీ చేయనున్నారు.

అర్హతలు, ముఖ్యమైన వివరాలు


నీట్-యూజీ 2026 పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఈ ప్రవేశాలకు అర్హులు. ఇంటర్మీడియట్ (10ం2)లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఓసీ అభ్యర్థులు సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 45% మార్కులు, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 40% మార్కులు పొంది ఉండాలి. వయసు డిసెంబర్ 31, 2026 నాటికి 17 ఏళ్లు పూర్తి కావాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

దరఖాస్తు ప్రక్రియ, రుసుము

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ కేటగిరీ అభ్యర్థులు రూ.2,500, బీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.2,000 దరఖాస్తు రుసుముగా చెల్లించాలి. దరఖాస్తు సమయంలోనే విద్యార్హత, పుట్టిన తేదీ, కులం, నివాసం వంటి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని యూనివర్సిటీ స్పష్టంగా పేర్కొంది. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాతే మెరిట్ జాబితాను విడుదల చేస్తారు.

అసంపూర్తి వివరాలతో లేదా స్పష్టత లేని సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. తదుపరి దశలో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు విద్యార్థులు ఎప్పటికప్పుడు విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ drntr.uhsap.in ను గమనిస్తూ ఉండాలని రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్ సూచించారు.

# జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం




కాకినాడ, సెప్టెంబర్ 9,జనసేనలో స్తబ్దత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్దత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్దత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కళ్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కళ్యాణ్ మత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు. 2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

విజయవాడ, సెప్టెంబర్ 9, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు. వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

# కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ, సెప్టెంబర్ 9, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే. ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గేనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

విజయవాడ, సెప్టెంబర్ 9, మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది. ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది. ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

## నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్ల

విజయవాడ, సెప్టెంబర్ 9, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది. ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది. ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడుతుంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి రావడం వల్ల రాష్ట్రం రుణ సంక్షోభం దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. పైగా, క్రెడిట్ రేటింగ్‌లు తగ్గిపోయి భవిష్యత్తులో కొత్త అప్పులు పుట్టడం కూడా కష్టమవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కేవలం అప్పులపై ఆధారపడటం తగ్గించి, కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఉత్పాదకేతర ఖర్చులను అదుపు చేస్తూ, సంపదను సృష్టించే మూలధన రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ ఫలితాలు వచ్చే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

భోపాల్, సెప్టెంబర్ 9, (న్యూస్ పల్స్) మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి. ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

'దైవ లీల'గా ప్రచారం

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది. ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# రెబల్స్ డేంజర్ బెల్స్

తిరుపతి, సెప్టెంబర్ 9, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం.పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కువ పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది.మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది.అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

ముంబై, సెప్టెంబర్ 9, (న్యూస్ పల్స్) రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్స్, 3 వీలర్స్, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా చూస్తే సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధి 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

# సర్కార్ వారి రైడింగ్ యాప్..

హైదరాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమిషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమిషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్స్యూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

# మద్దులపల్లిలో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి 100 మందికి పైగా చేరిక**

**ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం**

**నిరుద్యోగులకు ఉపాధి మరిచి తమ్ముడికి ఉపాధి చూపించిండు**

**కేసీఆర్ వస్తనే సబ్బండ వర్గాలకు మేలని ఆకాంక్షిస్తున్నరు**

**కాళేశ్వరం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మహాదేవపూర్ మద్దులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొట్టె రవీందర్ మరియు వార్డు మెంబర్ చకినరపు సంతోష్ మరియు రాజక్క, సమ్మక్క తదితర మహిళలు, లాస్మయ్య, కళ్యాణ్, రమేష్, శ్రీధర్, సంతోష్, దేవేందర్, రాజయ్య, ఎర్రయ్య, తిరుపతి సుమారు 100 మంది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి కండువాలు కప్పి భిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు... ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్దులపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వానికి బలం చేకూర్చేందుకు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాల్లో ఎంతమందికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయో ప్రజలు ఆలోచించాలని సూచించారు. మంథనికి ఐటీ కంపెనీలు తీసుకురావడంలో, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించేలా కృషి చేస్తానని, అవసరమైతే తన సొంత ఖర్చుతోనూ సహాయం చేస్తానని తెలిపారు.కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణ పనులపైనా ఆయన విమర్శలు చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో ఆలయాన్ని కూల్చివేయాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు తీరుపై ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం హామీ అమలు విషయాన్ని కూడా ప్రజలు గమనించాలని అన్నారు.మద్దులపల్లి గ్రామానికి చెందిన చాకినరపు రవీందర్ కి ఉద్యోగం రాకుండా కేసుల విషయంలో ఇబ్బందులు కల్పించారని పుట్ట మధుకర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాళేశ్వరం ఎస్ఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, రాబోయే రోజుల్లో ప్రజలకు అండగా ఉంటూ సేవ చేస్తామని తెలిపారు.

# ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 9, భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు. అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల పొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలో భవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌వేకు ఇరువైపులా మూడు లేన్ల సర్వీస్ రోడ్లు, రెండు మీటర్ల గ్రీన్‌బెల్ట్, మూడు మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్, రెండు మీటర్ల ఫుట్‌పాత్, రెండు మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇది కేవలం వాహనాల రాకపోకలకు మాత్రమే కాకుండా పాదచారులు, సైక్లిస్టులు, స్థానిక రవాణాకు కూడా ఉపయోగపడే సమగ్ర రహదారి వ్యవస్థగా రూపుదిద్దుకోనుంది.రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే భారత్ ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ నగరానికి అనుసంధానం మరింత మెరుగుపడనుంది. రహదారి వెంట పారిశ్రామిక, వాణిజ్య, నివాస అభివృద్ధికి ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా వేగవంతమైన రవాణా సదుపాయాలతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు బిగ్ బూస్ట్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# కాంగ్రెస్ లో రేవంత్ కు ఫుల్ పవర్స్...



హైదరాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియా ముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు.ఇటీవలే ఒకే రోజు ఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి. ఆదిలాబాద్ వివాదంలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్ రెడ్డిల వివరణ కోరారు. ఎంతటి సీనియర్ నేతలైనా సరే, బహిరంగ వివాదాలకు దిగితే సహించేది లేదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారుఈ కఠిన వైఖరి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి ఢిల్లీ అధిష్టానం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ అంచనాల వేళ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్లు ఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ తర్వాత సీఎం సమావేశాల్లో పాల్గొని లైన్‌లోకి రావడం ద్వారా ఒక స్పష్టమైన సంకేతం వెళ్లింది. తిరుగుబాటు స్వరాలు వినిపిస్తే మంత్రి పదవులే కాదు, పార్టీలో ఉనికికే ప్రమాదమనే విషయాన్ని ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్టానం ప్రాక్టికల్‌గా రుజువు చేసింది.ఇకపై ఎవరూ నోరెత్తకుండా రేవంత్ రెడ్డి చెప్పినట్లే వింటారా? అనే కోణంలో చూస్తే.. ఇది కేవలం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలోనే మల్లు రవి ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడే బాధ్యతను రేవంత్ రెడ్డి-పీసీసీలకే అప్పగించడంతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ గీత దాటితే చర్యలు ఖాయమని అర్థమైపోయింది. కాంగ్రెస్ లాంటి కల్చర్ ఉన్న పార్టీలో అసమ్మతిని నూటికి నూరు శాతం అణచివేయడం సులభం కాకపోయినా, ఈ కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగానైనా నేతలు సైలెంట్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి టీమ్ ముందుకు సాగుతున్న తరుణంలో, ఈ క్రమశిక్షణా అస్త్రం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తీసుకొస్తుందో లేదో వేచి చూడాలి.

# ఎండిపోతున్న పంటలు... రైతుల గగ్గోలు...

నిజామాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణలో వర్షాకాల సీజన్ కీలక దశకు చేరుకున్న సమయంలో వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఆశించిన స్థాయిలో పంటల సాగు జరగకపోగా.. ప్రస్తుతం పంటల ఎదుగుదలకు అత్యవసరమైన వర్షాలు లేకపోవడం సమస్యగా మారింది. రాష్ట్రంలో ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 22.5 శాతం లోటు నమోదైంది.

ముఖ్యంగా 20 జిల్లాల్లోని 376 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి.

నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో జూన్‌లో 11.74 శాతం, జులైలో 1.36 శాతం, ఆగస్టులో 37.67 శాతం, సెప్టెంబరులో ఇప్పటివరకు ఏకంగా 77.76 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణంగా 626.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 485.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 140.6 మిల్లీమీటర్ల లోటు ఏర్పడింది. జిల్లాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తే హనుమకొండలో అత్యధికంగా 48.73 శాతం లోటు నమోదైంది. ఆ తర్వాత వరంగల్‌లో 47.58, జనగామలో 44.14, జోగులాంబ గద్వాలలో 42.44, భద్రాద్రి కొత్తగూడెంలో 37.93 శాతం లోటు ఉంది. ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.రాష్ట్రంలోని 621 మండలాల్లో 15 మండలాల్లో అత్యధిక లోటు, 361 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 213 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా.. 32 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వర్షాభావం ప్రభావం ప్రధానంగా వరి సాగుపై పడింది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 1,22,70,185 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అంటే 92.69 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తయింది. గత ఏడాది ఇదే సమయానికి 1,28,76,525 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.ప్రధాన పంట వరి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సాధారణంగా 65,95,645 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 53,88,969 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే 81.7 శాతం విస్తీర్ణానికే పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి 63,66,253 ఎకరాల్లో వరి సాగైంది. కీలక సాగు సమయం దాటిపోవడంతో ఇక వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట ఎదుగుతున్న దశలో ఉండటంతో వర్షాలు లేక పొలాల్లో నీటి కొరత ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు పత్తి, ఇతర పంటలు కాత, పూత దశకు చేరుకున్నాయి. ఈ దశలో తగినంత తేమ అందకపోతే దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది.వ్యవసాయశాస్త్రవేత్తల ప్రకారం పంటలను ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కించాలంటే కనీసం రెండు నుంచి మూడు భారీ వర్షాలతో పాటు వారం రోజులపాటు సాధారణ వర్షాలు అవసరం. అప్పుడే పంటలకు అవసరమైన తేమ లభించి దిగుబడులపై ప్రతికూల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా, వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ దృష్టి సారిస్తోంది. వరి పొలాల్లో గడ్డి పెరిగిన ప్రాంతాల్లో ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మసేద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

# మైలేజ్ ఎవరికి డ్యామేజ్ ఎవరికి

హైదరాబాద్, సెప్టెంబర్ 9, తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణం తీవ్ర ఉద్రిక్తతకు, రాజకీయ వ్యూహప్రతివ్యూహాలకు వేదికగా మారింది. సభ లోపల ఏం జరిగిందనే దానికంటే కూడా, సభ బయట ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ , అధికార కాంగ్రెస్ మధ్య నడిచిన పొలిటికల్ వార్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ప్రారంభానికి ముందే పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన బీఆర్ఎస్ నాయకత్వం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో నిరసనకు దిగింది. కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో గులాబీ శ్రేణులు చేసిన ఈ హంగామాతో మీడియా దృష్టి మొత్తం ఒక్కసారిగా వారివైపే మళ్లింది.అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు నిరసనకారులను అడ్డుకోవడంతో తోపులాట జరిగి వాతావరణం మరింత వేడెక్కింది. ప్రభుత్వంపై నైతిక విజయం సాధించి, రాజకీయన్ని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న బీఆర్ఎస్ వ్యూహం మొదటి దశలో విజయవంతమైనట్లే కనిపించింది. మీడియా అటెన్షన్ సాధించడం, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రక్షణలో పడేయడంలో ప్రతిపక్షం అనుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. అయితే, ఈ పొలిటికల్ గేమ్‌లో బీఆర్ఎస్ సాధించిన మైలేజ్ అంతా ఒక్క చిన్న తొందరపాటు వ్యాఖ్యతో తలకిందులైంది.భద్రతా సిబ్బందితో జరిగిన తోపులాట, పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ పదవినీ, వ్యవస్థలను ఉద్దేశించి ఆయన చేసినట్లుగా ప్రచారంలోకి వచ్చిన అనుచిత వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని లేపాయి. ప్రభుత్వ విధానాలపై దాడి చేయాల్సిన ప్రతిపక్షం, ఈ ఒక్క ఘటనతో ఒక్కసారిగా స్వయంగా ఆత్మరక్షణలో పడిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. నిరసనలతో సంపాదించిన మైలేజ్ కాస్తా ఈ వివాదంతో ఆవిరైపోయింది. బీఆర్ఎస్ దూకుడుకు కౌంటర్ ఇచ్చేందుకు సరైన అవకాశం కోసం చూస్తున్న అధికార కాంగ్రెస్‌కు తాతా మధు వ్యాఖ్యలు అతిపెద్ద అస్త్రంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీఆర్ఎస్ వైఖరిపై విరుచుకుపడ్డారు. దళిత వర్గానికి చెందిన సభాపతిని, రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానాన్ని అవమానించారంటూ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో పొలిటికల్ నరేటివ్ ఒక్కసారిగా మారిపోయి కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యంలోకి వచ్చింది.అధికార పక్షం నుంచి అనూహ్య రీతిలో ఎదురుదాడి జరగడం, సమాజంలో కూడా ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయని గ్రహించిన బీఆర్ఎస్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. వివాదం మరింత ముదరకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే స్పందిస్తూ, తాను సభాధిపతిని ఉద్దేశించి ఆ మాటలు అనలేదని, కేవలం తమపై దౌర్జన్యం చేసిన పోలీసుల తీరుపైనే మాట్లాడానని వివరణ ఇచ్చుకున్నారు. ఏదేమైనా ఆ వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపం చెంది ఉంటే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించక తప్పలేదు. వర్షాకాల సమావేశాల తొలిరోజు అసెంబ్లీ వెలుపల నడిచిన ఈ పొలిటికల్ డ్రామా తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర మైండ్ గేమ్‌కు అద్దం పట్టింది. ఆరంభంలో నల్ల టీషర్టుల నిరసనతో హంగామా సృష్టించి పైచేయి సాధించిన బీఆర్ఎస్, సొంత నేత చేసిన వ్యాఖ్యల వల్ల చివరకు డిఫెన్స్‌లో పడాల్సి వచ్చింది. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా ఆ తప్పును పట్టుకుని తిప్పికొట్టిన కాంగ్రెస్, మొదటిరోజు పొలిటికల్ అడ్వాంటేజ్ సాధించడంలో విజయం సాధించిందని చెప్పాలి.

**ఫ్రూఫ్ లతో చూపించిన అధికార పార్టీ**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయ యుద్ధం ఊహించని మలుపులు తిరుగుతోంది. సమావేశాల ప్రారంభ వేళ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఇరకాటంలో పెట్టాలని భావించిన బీఆర్ఎస్, అనూహ్యంగా తానే తీవ్ర ఆత్మరక్షణలోకి జారుకుంది. ఆందోళనలతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వేసిన ఎత్తుగడలు కాస్తా, అధికార పక్షం విడుదల చేసిన వీడియో ఆధారాలు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల దుమారంతో బెడిసికొట్టాయి.అసెంబ్లీ సమావేశాల తొలి రోజే నల్ల టీషర్టులు ధరించి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీతో సభలోకి ప్రవేశించాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. అయితే అసెంబ్లీ సమీపంలో పోలీసులు గులాబీ నేతలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు తమ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేశారని, మహిళా సభ్యులతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మహిళా ఎమ్మెల్యేలు మీడియా ముందే కన్నీటిపర్యంతం కావడం, కొందరు నేతలకు గాయాలయ్యాయని ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందడంతో తొలిరోజు ప్రజల్లో కాస్త సానుభూతి వ్యక్తమైంది. పోలీసుల అత్యుత్సాహమే ఇందుకు కారణమంటూ ప్రభుత్వంపై నైతిక దాడిని ప్రారంభించింది.బాధితుల కార్డుతో పైచేయి సాధించవచ్చని భావించిన గులాబీ దళానికి ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్ ఊహించని షాక్ ఇచ్చింది. ఘటనా స్థలంలో రికార్డయిన వీడియోలు, ఫోటోలను ప్రభుత్వం ఆధారాలతో సహా మంగళవారం బహిర్గతం చేయడంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు దాడి చేయలేదని, గులాబీ ప్రజాప్రతినిధులే ఖాకీలపై భౌతిక దాడులకు దిగారని ఈ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల చొక్కాలు పట్టుకుని లాగడం, విధుల్లో ఉన్న మహిళా పోలీసులపైకి దూసుకువెళ్లడం కనిపించింది. వీటన్నింటికీ మించి స్వయంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ పోలీసు అధికారిని తోసేస్తున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో బీఆర్ఎస్ కథనం ఒక్కసారిగా బలహీనపడింది. శాంతిభద్రతలను కాపాడే పోలీసులపైనే దాడి చేసి, ఎదురు బాధితులమని ప్రచారం చేసుకోవడం ఏమిటన్న ప్రశ్నలు ప్రజాక్షేత్రంలో మొదలయ్యాయి.

# హిజ్రాల దందాపై పోలీసులు దృష్టి

రంగారెడ్డి, సెప్టెంబర్ 9, శుభకార్యాలు, వేడుకలు జరిగే ప్రదేశాలకు హిజ్రాలు కచ్చితంగా ఎలా వస్తారు? ఎక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా వారికి ముందుగా సమాచారం ఎలా అందుతుంది? ఈ ప్రశ్నలు చాలామంది మదిని తొలిచేవే. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశం సందర్భంగా హిజ్రాలు ప్రవర్తించిన తీరుపై తీవ్ర దుమారం రేగడంతో వారి సమాచార వ్యవస్థపై చర్చ మొదలైంది. దీని వెనుక ఓ పక్కా వ్యవస్థ, పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.ఇంతకీ వీరికి సమాచారం ఎలా అందుతుందంటే.. దీని వెనుక పక్కా కమిషన్ దందా నడుస్తోందని ఓ హిజ్రా స్వయంగా ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాల వంటి శుభకార్యాల వివరాలను తమకు చేరవేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేస్తారని ఆమె తెలిపారు. వారి ద్వారానే తమకు ఫంక్షన్ల లోకేషన్లు తెలుస్తాయని వివరించారు.

**సమాచారం ఇచ్చేది వీరే..**

ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శుభకార్యాలకు సంబంధించిన వ్యక్తులే హిజ్రాలకు ప్రధాన ఇన్ఫార్మర్లు.

టెంట్ హౌస్ వాళ్లు: ఫంక్షన్లకు టెంట్లు, కుర్చీలు సరఫరా చేసేవారు.

పంతుళ్లు: పూజలు, శుభకార్యాలు జరిపించే పురోహితులు.

గోమాతను తెచ్చేవారు: గృహప్రవేశాల వంటి వాటికి గోమాతను తీసుకువచ్చేవారు.

సన్నాయి మేళం వాళ్లు: ఫంక్షన్లలో సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు.


బిల్డర్లు, వాచ్‌మెన్లు: కొత్తగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో పనిచేసేవారు.

ఈ వ్యక్తులు ఫలానా చోట ఫంక్షన్ జరుగుతోందని ముందుగానే తమకు ఫోన్ చేసి లోకేషన్ పంపిస్తారని సదరు హిజ్రా తెలిపారు.కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దీనికి వారు కమిషన్ కూడా తీసుకుంటారని ఆమె చెప్పడం గమనార్హం. గతంలో ఒక్కో లోకేషన్‌కు రూ.200 నుంచి రూ.500 ఇచ్చేవాళ్లమని, ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.2000 ఇవ్వనిదే ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ముఖ్యంగా గృహప్రవేశానికి గోమాతను తీసుకొచ్చేవారు రూ.3000 వరకు డిమాండ్ చేస్తారని, అంత ఇస్తేనే గానీ అడ్రస్ చెప్పరని వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో ఎవరు ముందుగా సమాచారం ఇస్తే, వారికే కమిషన్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.చింతల్ ఘటనపై స్పందిస్తూ, కొందరు హిజ్రాలు మాత్రమే డబ్బుల కోసం దౌర్జన్యంగా ప్రవర్తిస్తారని, వారి వల్లే తమ వర్గం మొత్తానికి చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

తామంతా కడుపు నింపుకోవడానికే ఈ పని చేస్తామని, చాలామంది ఎంత ఇస్తే అంత తీసుకుని ఆశీర్వదించి వెళ్లిపోతారని చెప్పారు. కొందరు దాతలు తమను స్వయంగా ఇళ్లకు పిలిపించుకుని గౌరవిస్తారని గుర్తుచేశారు. ఏదేమైనా శుభకార్యాల వద్ద హిజ్రాల సందడి వెనుక ఇంత పెద్ద కమిషన్ నెట్‌వర్క్ పనిచేస్తోందనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన

**తిరుమల అలిపిరి నడకమార్గంలో మరోసారి చిరుత సంచారం**
**7వ మైలు వద్ద చిరుతను చూసి భయపడిన భక్తులు**
**నరసింహస్వామి ఆలయం సమీపంలోనూ కనిపించినట్లు సమాచారం**
**భక్తులను గుంపులుగా మాత్రమే అనుమతిస్తున్న టిటిడి**
**నడకమార్గంలో భద్రతను పెంచి, నిఘా ఏర్పాటు చేసిన అధికారులు**



తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు.

రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ ఇలాంటి భద్రతా చర్యలనే అమలు చేసింది.

# దళితుల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదు!

## అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల నిరసన..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్సీ తాతా మధు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలు, అనంతరం దళిత సంఘాల నిరసనల నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలపై సత్తుపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి.

సత్తుపల్లి పట్టణంలోని బస్టాండ్ సెంటర్ మెయిన్ రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు నిరసన చేపట్టారు.

ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిరసన తెలిపారు.

“దళితుల గౌరవాన్ని కించపరిచే చర్యలను సహించేది లేదు” అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు.

**పసుపు నీళ్లతో శుద్ధి చేశారంటూ మండిపాటు**

దళిత సంఘాల నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం వద్ద నిరసన చేపట్టిన అనంతరం, వారు వెళ్లిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేశారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

ఈ చర్య తెలంగాణలోని దళిత సమాజాన్ని అవమానపరిచే విధంగా ఉందని డాక్టర్ మట్టా దయానంద్ తీవ్రంగా ఖండించారు. సామాజిక సమానత్వం, మానవ గౌరవం, రాజ్యాంగ విలువలను ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాలని ఆయన అన్నారు.

కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, తాతా మధుతో పాటు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యపై కూడా దళితుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు.

“అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించింది.. కానీ దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం ఏ సామాజిక న్యాయం?” అంటూ కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నించాయి.

**భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు**

ఈ నిరసన కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఖమ్మం జిల్లా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, సత్తుపల్లి పట్టణ, మండల, వేంసూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ సంఘాల నాయకులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, సోషల్ మీడియా విభాగాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం సాక్షిగా.. దళితుల గౌరవాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేశాయి.

# ‘సీన్’.. మరోసారి పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా సూర్య

**సూర్య – జితూ మాధవన్ సినిమాకు ‘సీన్’గా టైటిల్ ఖరారు**
**దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల**
**డీఎస్పీ ఇన్బరాజ్ పాత్రలో కనిపించనున్న సూర్య**
**అంచనాలు పెంచుతున్న టైటిల్ అనౌన్స్‌మెంట్ టీజర్**
**హీరోయిన్‌గా నజ్రియా, కీలక పాత్రలో నస్లెన్**

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు జితూ మాధవన్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చేసింది. బుధవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి ‘సీన్’ అనే పేరును ఖరారు చేస్తూ, ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.




ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది. “అతని నీచమైన స్వభావాన్ని దాచిపెట్టడానికి మీరంతా అతని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు” అనే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పోలీస్ గెటప్‌లో సూర్య ఒక క్రైమ్ సీన్‌లోకి ఎంట్రీ ఇస్తాడు. “ఎవరు ఎవర్ని చంపారు?” అని ఆయన అడగ్గా, “అది కనుక్కోవడానికే కదా మీరు వచ్చింది” అని ఓ కానిస్టేబుల్ సమాధానమిస్తాడు.

ఈ చిత్రంలో సూర్య ‘డీఎస్పీ ఇన్బరాజ్’ అనే పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తున్నారు. “సందేహితులు ఇన్బరాజ్ సార్‌ను చూస్తే చాలు, వింతగా ప్రవర్తించడం మొదలుపెడతారు” అని జైల్ వార్డెన్ చెప్పడం, “ఇన్బరాజ్ సార్ వస్తున్నారు, ఎవరూ బయటకు రావొద్దు” అని ఖైదీలను హెచ్చరించడం వంటి సన్నివేశాలు పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. “నా ముఖం బాగా చూసుకో. నీకు, నిన్ను అరెస్ట్ చేసిన ఒకే ఒక్క పోలీస్‌ను నేనే కావచ్చు.. కానీ నాకు, నేను జైల్లో పెట్టిన 900 మంది నేరస్థుల్లో నువ్వొకడివి” అంటూ సూర్య చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది.

ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ సూర్య తన ‘ఎక్స్’ ఖాతాలో, “అందరికీ నమస్కారం, ఇదిగో ‘సీన్’ నుంచి చిన్న గ్లింప్స్. నవంబర్ 6 నుంచి థియేటర్లలో. చణవవజూఖుఝశ్రీఱ2026” అని పోస్ట్ చేశారు.

ఇప్పటివరకు ‘సూర్య 47’గా పిలవబడిన ఈ సినిమాను జఘరం స్టూడియోస్ నిర్మిస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ నటుడు నస్లెన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జాన్ విజయ్, ఆనందరాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తుండగా, వినీత్ ఆగస్టియన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జితూ మాధవన్ – సూర్య కాంబినేషన్ ప్రకటన వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య గతంలో సింగం సిరీస్ సినిమాల్లో శక్తిమంతమైన పోలీస్ అధికారిగా కనిపించడం తెలిసిందే.

# “ఒక్క మెతుకు పొలిమేర దాటదు”.. ‘రణబాలి’గా గర్జించిన విజయ్ దేవరకొండ..

**బ్రిటిష్ కాలం నాటి కరవు నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామా**
**గూస్‌బంప్స్ తెప్పిస్తున్న విజయ్ మాస్ డైలాగ్, ఎంట్రీ**
**రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం**
**దసరా కానుకగా అక్టోబర్ 16న సినిమా విడుదల**



రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది.

టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో ‘అన్నపూర్ణ దేశం’ ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. “సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా” అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి.

1854–1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876–78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. “సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు” వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి.

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ–సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో ‘రణబాలి’ ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# ‘ఎపిక్’ ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా నిలుస్తుంది: విజయ్ దేవరకొండ

**‘బేబీ’ జోడీ ఆనంద్, వైష్ణవి నటించిన ‘ఎపిక్’ ప్రీ రిలీజ్ వేడుక**
**ముఖ్య అతిథులుగా హాజరైన విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా**
**ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఇదొక అందమైన చిత్రంగా నిలుస్తుందన్న విజయ్**
**ట్రైలర్‌పై వస్తున్న విమర్శలకు స్పందించిన దర్శకుడు, నిర్మాత**
**సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్**



బ్లాక్‌బస్టర్ చిత్రం ‘బేబీ’ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్’. ‘90ం’ వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు.

ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. “90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. ‘ఎపిక్’ చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను” అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, ‘ఎపిక్’ తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, “ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు. దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను” అని తెలిపారు.

ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. “నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు” అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు.

హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, “ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది” అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన ‘కడలి’ పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. ‘ఎపిక్’ సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# ఓటీటీలో మలయాళ క్రైమ్ థ్రిల్లర్ .. సైకో పోలీస్ గా సునీల్!

ఆర్య హీరోగా చేసిన ‘అనంతన్ కాడు’
తమిళ – మలయాళ భాషల్లో విడుదలైన సినిమా
రాజకీయం – రౌడీయిజం నేపథ్యంలో సాగే కథ
ఒకేసారి 5 ఓటీటీలలో స్ట్రీమింగ్
కీలకమైన పాత్రలో మెప్పించిన సునీల్

తమిళంలో ఆర్యకి యాక్షన్ హీరోగా మంచి క్రేజ్ ఉంది. ఇక తెలుగు ప్రేక్షకులకు కూడా ఆయన సుపరిచితమే. అలాంటి ఆర్య హీరోగా ఒక సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే ‘అనంతన్ కాడు’. తమిళ .. మలయాళ భాషలలో ఈ సినిమాను జీఎన్ కృష్ణకుమార్ తెరకెక్కించాడు. గోకులం గోపాలన్ నిర్మించిన ఈ సినిమా, జూన్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. యావరేజ్ టాక్ ను సంపాదించుకుంది. అలాంటి ఈ సినిమా ఈ నెల 2వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’ తో పాటు మరో నాలుగు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పైకి వచ్చింది.



ఆర్య కథానాయకుడిగా నటించిన ఈ సినిమాలో, మురళీ గోపి .. దేవ్ మోహన్ .. ఇంద్రన్స్ ..
రెజీనా .. నిఖిల విమల్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. ఇక సునీల్ ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా కీలకమైన పాత్రను పోషించాడు. సైకో పోలీ ఆఫీసర్ గా ఈ సినిమాలో ఆయన నటన నెక్స్ట్ లెవెల్లో ఉంటుందనే టాక్ వచ్చింది. సునీల్ ఇంతవరకూ చేసిన నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్రలతో పోల్చుకుంటే, ఇది నెక్స్ట్ లెవెల్లో ఉంటుందని అంటున్నారు.

1990లలో .. తిరువనంతపురం నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. అక్కడి రాజకీయాలు .. రౌడీయిజాలు ప్రజలను భయపెడుతూ ఉంటాయి. అలాంటి గొడవలతో మనకెందుకులే అనుకుని పక్కకి తప్పుకుని వెళ్లిపోయే ఒక యువకుడు, అనుకోకుండా ఆ గొడవలలోకి లాగబడతాడు. అప్పటి నుంచి ఆయన జీవితం ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది కథ. ప్రస్తుతం ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఈ సినిమా దూసుకుపోతోంది. ఈ సినిమాను తెలుగు ఆడియోలో చూడాలనుకుంటే, లైన్స్ గేట్ ప్లే’లో మాత్రమే అవకాశం ఉంది.

# వర్షాభావ పరిస్థితులతో ఎండుతున్న పైర్లు

## (హెచ్.ప్రతాప్)

తెలంగాణలో నైరుతి రుతుపవనాలు మందగించడంతో వ్యవసాయ రంగంపై ఆందోళన పెరుగుతోంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 9 వరకు రాష్ట్రంలో సాధారణంగా 629.4 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 485.9 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 23 శాతం లోటు. సెప్టెంబర్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరం. సాధారణంగా ఈ నెలలో ఇప్పటివరకు 167.1 మి.మీ. వర్షం రావాల్సి ఉండగా కేవలం 12 మి.మీ. నమోదైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు లోటు వర్షపాతం పరిధిలోకి వెళ్లాయి. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో లోటు వరుసగా 49, 48, 44 శాతానికి చేరింది.

భారత వాతావరణ విభాగం ప్రకారం పెనిన్సులర్ భారతదేశంలో మరో వారం పాటు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నప్పటికీ, అవి విస్తృతంగా కురిసి లోటును పూడ్చుతాయన్న హామీ లేదు. ఈ నేపథ్యంలో రైతు పరిస్థితిని కేవలం వర్షాభావ గణాంకాలతో కాకుండా పంట పెట్టుబడి, పంట నష్టం, ఆదాయం, రుణభారం అనే నాలుగు కోణాల్లో చూడాలి.

వర్షాలు ఆలస్యం కావడంతో విత్తనాలు వేసిన పంటలు నీటి ఒత్తిడికి గురైతే, ఇంకా సాగు ప్రారంభించని రైతులు కూడా నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉంటారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే జిల్లాల వారీగా పంట పరిస్థితిపై శాస్త్రీయ అంచనా నిర్వహించాలి. వర్షాభావ ప్రభావిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ నిపుణులతో సూచనలు ఇవ్వాలి. పంట మార్పిడి లేదా ఆలస్యంగా విత్తే పరిస్థితుల్లో అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలి.

ఇప్పటికే పంటలు సాగులో ఉన్న ప్రాంతాల్లో సూక్ష్మ సేద్యం, తాత్కాలిక నీటి వనరుల వినియోగం, చెరువులు--కుంటల్లో అందుబాటులో ఉన్న నీటిని శాస్త్రీయంగా పంపిణీ చేయడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్ సరఫరా, విత్తనాలు, ఎరువులు, పంట రక్షణ సలహాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ అవసరం.

అత్యంత ముఖ్యంగా పంటల బీమా పరిధిని సమర్థంగా అమలు చేసి, నష్టం నిర్ధారణను వేగవంతం చేయాలి. వర్షాభావం కారణంగా దిగుబడి తగ్గితే రైతులకు పరిహారం అందేలా క్షేత్రస్థాయి సమాచారం త్వరగా సేకరించాలి. సహకార, బ్యాంకింగ్ సంస్థలతో సమన్వయం చేసి అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ, చెల్లింపు గడువు వెసులుబాటు వంటి చర్యలను పరిశీలించాలి.

ప్రస్తుత పరిస్థితి ఒక తాత్కాలిక వర్షాభావ సమస్యగా మాత్రమే చూడకూడదు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షం ఎప్పుడు వస్తుందో ఎదురుచూడటం నుంచి, వర్షం వచ్చినప్పుడు ప్రతి చుక్కను నిల్వ చేసుకునే వ్యవసాయ విధానానికి తెలంగాణ మారాలి. చెరువుల పునరుద్ధరణ, పొలాల్లో నీటి నిల్వ, భూగర్భజల పునర్భరణ, తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం దీర్ఘకాలిక విధానంగా మారాలి.

వర్షం రైతు చేతిలో ఉండదు. కానీ వర్షం తగ్గినప్పుడు రైతు నష్టాన్ని ఎంతవరకు తగ్గించాలి, అతని ఆదాయాన్ని ఎలా కాపాడాలి అన్నది ప్రభుత్వ విధాన నిర్ణయం. ఈ కష్టకాలంలో రైతుకు కావాల్సింది హామీలు కాదు---సమయానుకూలమైన విత్తనం, నీరు, బీమా, రుణ వెసులుబాటు, మార్కెట్ భరోసా. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతుకు ప్రభుత్వం నేలపై అండగా నిలబడినప్పుడే వ్యవసాయ రాష్ట్రంగా తెలంగాణ తన బలాన్ని నిలబెట్టుకోగలదు.

# బిసి కాలేజ్ బాలుర హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు

## పిడీఎస్ యు పోరాటానికి విజయం

## పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కే.పవన్ కుమార్

హైద్రాబాద్ సెప్టెంబర్ 9, వనపర్తి జిల్లా ప్రభుత్వ బిసి కాలేజ్ బాలుర హాస్టల్ వార్డెన్/హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. నరేందర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఛ జిల్లా మేజిస్ట్రేట్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పిడీఎస్ యు తెలంగాణ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం మీడియా సమావేశం లో పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కే.పవన్ కుమార్ మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ సౌకర్యాలు, ఆహారం, బియ్యం సరఫరా తదితర అంశాల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై పిడిఎస్ యు నిరంతరం ప్రశ్నిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిందని తెలిపారు.




తాజాగాఈ నెల 8 న కలెక్టర్ ఉత్తర్వుల ద్వారా నరేందర్ రెడ్డిని తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా సస్పెండ్ చేయడంతో పాటు, క్రమశిక్షణా చర్యలు మరియు విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. సస్పెన్షన్ కాలంలో ఆయనకు నిబంధనల ప్రకారం 50 శాతం బేసిక్ పే మరియు అర్హత కలిగిన అలవెన్సుల మేరకు జీవన భృతి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.పిడిఎస్ యు నిరంతరం

పిడిఎస్ యు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతు హాస్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్ని అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని,

హాస్టల్ స్టాక్ రిజిస్టర్, రైస్ ఇండెంట్, రైస్ రిసీప్ట్, మెస్ బిల్లులు, డైట్ బిల్లులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించాలని,

బియ్యం మరియు ఇతర ప్రభుత్వ సరుకులలో కొరత తేలితే బాధ్యుల నుంచి నష్టాన్ని రికవరీ చేయాలని,

విచారణను పారదర్శకంగా నిర్వహించి, తప్పు నిర్ధారణ అయితే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని,

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అవసరమైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని,

వనపర్తి జిల్లాలోని అన్ని దీజ/హాజ హాస్టళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, రికార్డులు మరియు స్టాక్‌ను పూర్తిగా ఆడిట్ చేయాలని,విద్యార్థుల సంక్షేమ నిధులు, ఆహార సరుకులు దుర్వినియోగం కాకుండా కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

“విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ప్రభుత్వ హాస్టళ్లలో అవకతవకలు జరిగితే రాష్ట్ర అధ్యక్షుడునాయకత్వం డిమాండ్లు నిరంతరం ప్రశ్నిస్తూ విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుంది. నరేందర్ రెడ్డి సస్పెన్షన్‌తో సమస్య ముగిసినట్లు కాకుండా, పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలి” అని పవన్ కుమార్ డిమాండ్ చేశారు.

# విడ్డూరం.. యువకుడి కడుపులో గర్భాశయం!

ఢిల్లీలో ఒక అత్యంత అరుదైన వైద్య వింత వెలుగులోకి వచ్చింది. సంతానలేమి సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన 26 ఏళ్ల యువకుడి శరీరంలో గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉండటాన్ని గుర్తించిన వైద్యులు విస్మయానికి గురయ్యారు. సాధారణ పరీక్షల క్రమంలోనే ఈ వింత విషయం బయటపడింది.

ఢిల్లీకి చెందిన సదరు యువకుడు సంతాన సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదించగా, అతనికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తరుణంలో పొత్తికడుపులో మహిళలకు ఉండే గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్ ఉన్నట్లు తేలింది. వైద్య పరిభాషలో ఈ అరుదైన పరిస్థితిని ‘పర్సిస్టెంట్ ముల్లేరియన్ డక్ట్ సిండ్రోమ్’ అని పిలుస్తారని వైద్యులు వెల్లడించారు. జన్యుపరంగా పురుషుడైనప్పటికీ, వారి శరీరంలో స్త్రీ పునరుత్పత్తి అవయవాలు కూడా అభివృద్ధి చెందడం ఈ సిండ్రోమ్ యొక్క ప్రధాన లక్షణం.


ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు ఇలాంటి కేసులు 300 కంటే తక్కువగానే నమోదయ్యాయని వైద్య నిపుణులు వివరించారు. ఇది అత్యంత అరుదైన స్థితి కావడంతో దీనిని గుర్తించడం కూడా కష్టతరమని వారు పేర్కొన్నారు. అనంతరం వైద్యులు ఆ యువకుడికి శస్త్రచికిత్స నిర్వహించి, గర్భాశయ సంబంధిత భాగాలను విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం ఆ యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# చలో హైదరాబాద్ కార్యక్రమంపై ఫలితం ఊహించిందే

## ఉద్యోగుల హక్కుల సాధనే ధ్యేయంగా సాగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జాయింట్ స్ట్రగుల్ కమిటీ

హైద్రాబాద్ సెప్టెంబర్ 9: సమస్యల సాధనకై చలో హైదరాబాద్ కార్యక్రమంపై ఫలితం మేము ఊహించిందే జరిగిందని జాయింట్ స్ట్రగుల్ కమిటీ ఆఫ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ పెన్షనర్స్ అండ్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ (JSC ETW-POSECE) రాష్ట్ర ఛైర్మన్ టి ప్రభాకర్, సమన్వయ కర్త సయ్యద్ షౌకత్ అలీ, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు బి మురళీధర్ గౌడ్, టి హరికిషన్, దేవేందర్, ఎస్పీ కుమార్, ఎస్ ఎ జలీల్, ఆర్ రోహిత్ నాయక్ లు పేర్కొన్నారు.బుధవారం హైద్రాబాద్ లో మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సుదీర్ఘ కాల పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రస్తుతం ఉన్న రెండు ఉద్యోగ జేఏసీలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ఈ జేఏసీ నాయకత్వాలకు నిజమైన చిత్తశుద్ధి లేదనేది బహిరంగ వాస్తవం.



అయినప్పటికీ, ఈ నెల 10వ తేదీన ఆ రెండు జేఏసీల ఆధ్వర్యంలో ‘చలో హైదరాబాద్’ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి . దానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ వర్గాలు పెద్ద ఎత్తున తరలి రావడానికి సిద్ధమైన నేపథ్యంలో, ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నేతలు ప్రకటించడం ద్వారా ఉద్యోగులను మోసం చేశారని వారు విమర్శించారు. జేఏసీ నేతలకు సమస్యల పరిష్కారం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో వాయిదా సంఘటన తేటతెల్లం చేస్తోందని వారు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్రంలో జాయింట్ స్ట్రగుల్ కమిటీ ని అనివార్యంగా పునరుద్ధరణ చేయడం జరిగిందని. ఇందులోకి చిత్తశుద్ధి ఉన్న సంఘాలు బయటకు వచ్చి తమతో కలిసి రావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సదరు జేఏసీ నాయకత్వాలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. గతంలో మాదిరిగా, ఇప్పుడు కూడా అదే నామమాత్రపు హామీలతో పోరాటాన్ని మధ్యలోనే విరమించారు. మీరు ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. సమస్యల పరిష్కారం పట్ల మీ చిత్తశుద్ధి ఏమిటో తెలిసిపోయింది. ఇక మీరు మీపై ఉన్న పెండింగ్ కేసులు పరిష్కారం చూసుకోండని చూచించారు.

ప్రభుత్వం నుండి పెండింగ్ డీఏలు, పిఆర్‌సి, సీపీఎస్ రద్దు వంటి కీలక డిమాండ్లపై స్పష్టమైన ఉత్తర్వులు వచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగించడం తక్షణ కర్తవ్యం గా జాయింట్ స్ట్రగుల్ కమిటీ భావిస్తోందన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనే ధ్యేయంగా సాగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అదే సమయంలో నాయకత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యమాన్ని తాకట్టు పెట్టకుండా ఒత్తిడి తేవాలని వారు పిలుపునిచ్చారు.

# భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు




హైదరాబాద్, సెప్టెంబర్ 9: నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, సాంస్కృతిక స్ఫూర్తితో నిర్వహించారు. ప్రముఖ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం ప్రొఫెసర్ డా. పాలెపు వారిజ రాణి ముఖ్య అతిథిగా హాజరుకాగా, కరీంనగర్లోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ ఛ పీజీ కళాశాల, తెలుగు విభాగం ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు గౌరవ అతిథిగా పాల్గొన్నారు.తెలుగు భాష గొప్పతనం, తెలంగాణ సాహితీ వైభవం, ఈ ప్రాంత సంస్కృతి--సంప్రదాయాలు, తెలంగాణ మాండలికంలోని ప్రత్యేకతలను విద్యార్థులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. మాతృ భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.

ప్రార్థనతో ప్రారంభమైన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్, ముఖ్య అతిథి, గౌరవ అతిథి, అధ్యాపకులు మరియు విద్యార్థులు కాళోజీకి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పేరాల కృష్ణా రావు మాట్లాడుతూ, శ్రీ కాళోజీ నారాయణరావు సాహిత్య ప్రయాణం, ఆయన చేసిన పోరాటాల గురించి విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించారు. “తెలుగు మన అస్తిత్వానికి, సంస్కృతికి మరియు సంప్రదాయాలకు ప్రతీక” అని పేర్కొంటూ, విద్యార్థులు తమ మాతృభాష పట్ల గర్వపడాలని, తెలంగాణ సాహిత్య సంపదను అన్వేషించాలని, ప్రముఖ తెలుగు కవులు మరియు రచయితల రచనలను చదవాలని సూచించారు. ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటూనే తెలుగు భాషను కూడా పరిరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ముఖ్య అతిథి డా. పాలెపు వారిజ రాణి ప్రసంగిస్తూ, శ్రీ కాళోజీ నారాయణరావు కవిత్వంలోని భావజాలాన్ని, ఆయన ఆలోచనా సరళిని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వినూత్నంగా వివరించారు. తెలుగు భాష మరియు సాహిత్యం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, మన సంస్కృతి, విలువలు మరియు సామాజిక చైతన్యాన్ని భావితరాలకు అందించడంలో భాష, సాహిత్యం కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. యువత తమ మాతృభాషతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

గౌరవ అతిథి ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తెలుగు భాషలోని నుడికారాలు, తెలంగాణ తెలుగు యాస, గ్రామీణ వాడుక భాషలోని ప్రత్యేకతలను అద్భుతంగా వివరించారు. అనంతరం ‘ప్రజాకవి’ కాళోజీ నారాయణరావు జీవితం, సాహిత్య కృషి మరియు ప్రగతిశీల భావజాలం గురించి ప్రసంగించారు. కాళోజీ రచనలు సామాన్య ప్రజల జీవితాలు, ఆశలు, ఆకాంక్షలు, పోరాటాలను ఎలా ప్రతిబింబించాయో ఆయన వివరించారు.

సాంఘిక చైతన్యాన్ని పెంపొందించడంలో కాళోజీ సాహిత్యం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా చదవాలని, తెలంగాణ యాస సౌందర్యాన్ని ఆస్వాదించాలని వక్తలు విద్యార్థులను ప్రోత్సహించారు.

అదే సమయంలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి, గౌరవ అతిథి, అధ్యాపక బృందం మరియు విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా. పేరాల కృష్ణా రావు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆహార భద్రత అమలుపై క్షేత్రస్థాయి పరిశీలన

## 11న మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ పర్యటన

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 9:** తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్, సభ్యులు ఈ నెల 11న మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని రేషన్ దుకాణాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమిషన్ ఛైర్మన్, సభ్యులు పరిశీలించనున్నారు. ముఖ్యంగా జాతీయ ఆహార భద్రతా చట్టం--2013లోని సెక్షన్ 4(బి) కింద ప్రసూతి ప్రయోజనాల అమలు, ఎంసీహెచ్ కిట్ల పంపిణీ తదితర అంశాలను పరిశీలించనున్నారు.

క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఆయా పథకాల అమలుకు సంబంధించి ప్రజలు తమ అభ్యంతరాలు, సమస్యలు, ఫిర్యాదులను కమిషన్ దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

అనంతరం అదే రోజు మేడ్చల్--మల్కాజిగిరి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో సంబంధిత శాఖల అధికారులతో ఆహార భద్రతా చట్టం అమలు, సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

ఈ సమీక్షా సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు అవసరమైన సమాచారం, రికార్డులతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# లయన్స్ కంటి హాస్పిటల్ వైరా వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం.





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 9:**కల్లూరు మండలం ముచ్చారమ్ గ్రామం నందు పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ శీలం జమలయ్య సహకారంతో ఉచిత కంటి వైద్య శిభిరం విజయవంతం చేశారు .ఈ ఉచిత క్యాంపు ని గ్రామ సర్పంచ్ శీలం జమలయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ కంటి హాస్పిటల్ వైరా వారు మా గ్రామానికి వచ్చి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి, కంటి సమస్యతో భాదపడుతున్న ఎంతో మందికి పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు అందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్డాక్టర్ కాపా మురళీకృష్ణ గ,హాస్పిటల్ నిర్వాహుకులు ఉండ్రు శ్యాంబాబు డాక్టర్ రవిచంద్ర ని , హాస్పిటల్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.గ్రామా ప్రజలతరపున కృతజ్ఞతలు తెలియజేసారు.

## వైరా లో ఘనంగా విశ్వేశ్వరరావు జన్మదిన వేడుకలు..



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 9:**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు జన్మదిన వేడుకలను వైరాలో ఘనంగా నిర్వహించారు. వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావు, మణికుమారి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం నూతన వస్త్రాలను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, వాసవి యూత్ సభ్యులు, నాయకులు, మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు పాల్గొని వనమా విశ్వేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# కేవలం రూ.500తో అవుట్ డోర్ ఏసీ యూనిట్ కు రక్షణ!

**వర్షాకాలంలో ఏసీ ఔట్‌డోర్ యూనిట్‌ను నిర్లక్ష్యం చేస్తే భారీ నష్టం**

**రూ. 500 రెయిన్ కవర్‌తో వేల రూపాయల రిపేర్ ఖర్చు ఆదా**

**తుప్పు పట్టకుండా కాపాడుకోవడం ద్వారా కేసింగ్ మార్చే భారం దూరం**

**గ్యాస్ లీక్‌లను అరికట్టి, రీఫిల్లింగ్, కంప్రెసర్ రిపేర్ల నుంచి ఉపశమనం**

వర్షాకాలం ప్రారంభం కాగానే చాలామంది ఏసీ వినియోగాన్ని తగ్గిస్తారు. అయితే, బయట ఉండే ఔట్‌డోర్ యూనిట్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాత్రం పూర్తిగా విస్మరిస్తుంటారు. ఈ చిన్నపాటి నిర్లక్ష్యం భవిష్యత్తులో వేల రూపాయల అదనపు ఖర్చుకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఒక సాధారణ 'రెయిన్ కవర్' వాడటం ద్వారా ఈ నష్టాన్ని సులభంగా నివారించవచ్చని వారు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో గాలిలోని తేమ, దుమ్ము, ధూళి వల్ల ఔట్‌డోర్ యూనిట్ త్వరగా తుప్పు పట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఏసీ సామర్థ్యాన్ని బట్టి రూ. 300 నుండి రూ. 800 మధ్య లభించే రెయిన్ కవర్‌లను వినియోగించడం వల్ల యూనిట్‌పై నేరుగా వర్షపు నీరు పడకుండా అడ్డుకోవచ్చు. ఒకవేళ యూనిట్ కేసింగ్ తప్పు పడితే, దానిని మార్చడానికి బ్రాండ్‌ను బట్టి రూ. 2,000 నుండి రూ. 5,000 వరకు ఖర్చవుతుంది. ఈ భారీ వ్యయంతో పోలిస్తే, కేవలం రూ. 500తో కొనే రెయిన్ కవర్ ఎంతో శ్రేయస్కరం.

తుప్పు సమస్య కేవలం బాడీకి మాత్రమే పరిమితం కాదు. లోపల ఉండే కాపర్ కాయిల్స్, జాయింట్లపై కూడా ప్రభావం చూపి లీకేజీలకు కారణమవుతుంది. దీనివల్ల ఏసీలోని రిఫ్రిజెరెంట్ గ్యాస్ లీక్ అవుతుంది. సాధారణంగా 1.5 టన్ ఏసీకి గ్యాస్ రీఫిల్లింగ్ చేయించాలంటే రూ. 2,500 నుండి రూ. 4,000 వరకు ఖర్చవుతుంది. ఒకవేళ లీకేజీని గుర్తించడంలో ఆలస్యమైతే, కంప్రెసర్ దెబ్బతినే ప్రమాదం ఉంది. అప్పుడు మరమ్మతు ఖర్చులు రూ. 8,000 దాటవచ్చు. రెయిన్ కవర్ వాడటం వల్ల యూనిట్ పొడిగా ఉండి, ఇటువంటి సాంకేతిక సమస్యల ముప్పు తప్పుతుంది.

ఆర్థిక కోణంలో విశ్లేషిస్తే, కేవలం రూ. 500 విలువైన కవర్ ఉపయోగించడం, నెలకోసారి యూనిట్‌ను శుభ్రం చేయడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు భారీ ఖర్చులను నివారిస్తాయి. కేసింగ్ మార్పిడి లేదా గ్యాస్ రీఫిల్లింగ్ వంటి ఖర్చులతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ చిన్న పెట్టుబడి దీర్ఘకాలంలో ఏసీ పనితీరును మెరుగుపరచడమే కాకుండా, వినియోగదారులను అనవసరపు ఆర్థిక భారాల నుండి కాపాడుతుంది.

# పోషణపై ప్రజలకు విస్తృత అవగాహన

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 9వ పోషణ మాసం



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబర్ 9:**ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందించేందుకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా 9వ పోషణ మాస కార్యక్రమాలను సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.

ఈ సందర్భంగా బుధవారం ఐడీఓసీ సముదాయంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ అధ్యక్షతన 9వ పోషణ మాస పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన, సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సరైన పోషణ, అనుబంధ ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల ఎత్తు, బరువు తదితర వృద్ధి ప్రమాణాలను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించనున్నారు.

అలాగే పోషకాహారంపై అవగాహన కల్పించడం, పోషకాహార ప్రదర్శనలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు, తల్లిదండ్రుల సమావేశాలు, ఇతర కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్థానికంగా లభించే వివిధ రకాల పోషక విలువలున్న ఆహార పదార్థాల వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

పోషకాహారం -- ఆరోగ్యం -- ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే సందేశంతో ప్రతి కుటుంబానికి పోషణ ప్రాధాన్యతను చేరవేసే విధంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారి సూచించారు.

జిల్లాలోని తల్లిదండ్రులు, మహిళలు, యువత ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

# నేరాల నియంత్రణ.. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

## కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**సత్తుపల్లి , ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** నేరాల నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సమగ్రంగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.



పెండింగ్ కేసులను నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి, నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలు, బాలలపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అక్రమ రవాణా, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, దర్యాప్తు నాణ్యత, సిబ్బంది పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉండేలా పోలీసింగ్‌ను బలోపేతం చేసి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పాల్గొన్నారు.

## షాకింగ్: ఆండ్రాయిడ్ పరికరం ఆర్డర్ చేస్తే.. ఆవు పేడ వచ్చింది!

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసాలు నిత్యకృత్యమవుతున్నప్పటికీ, కొన్ని ఘటనలు మాత్రం విస్మయానికి గురిచేస్తుంటాయి. గ్రేటర్ నోయిడాలో తాజాగా వెలుగుచూసిన ఒక ఉదంతం కలకలం రేపుతోంది. ఒక వ్యక్తి ఆండ్రాయిడ్ పరికరం (డివైస్) కోసం ఆర్డర్ ఇవ్వగా, అతనికి అందిన పార్శిల్‌లో ఆవు పేడ ఉండటం సంచలనంగా మారింది.

వివరాల్లోకి వెళ్తే, గ్రేటర్ నోయిడాలోని దన్‌కౌర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఆకాశ్ నగర్ అనే వ్యక్తి, ఒక ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా రూ. 1,999 విలువైన ఆండ్రాయిడ్ డివైస్‌ను ఆర్డర్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి మొత్తాన్ని ఆయన ముందుగానే చెల్లించారు. సోమవారం సాయంత్రం కొరియర్ ద్వారా పార్శిల్ అందగా, దానిని తెరిచి చూసిన ఆయన ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆర్డర్ చేసిన వస్తువుకు బదులుగా లోపల ఆవు పేడ ఉండటంతో తాను మోసపోయానని గ్రహించారు.

ఈ ఘటనపై బాధితుడు ఆకాశ్ వెంటనే స్థానిక పోలీసులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు వెబ్‌సైట్ వివరాలు, నగదు చెల్లింపులు, కొరియర్ డెలివరీ చైన్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, విచారణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

ఇలాంటి ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. కేవలం గుర్తింపు పొందిన సంస్థలు, అధికారిక వెబ్‌సైట్ల నుంచి మాత్రమే వస్తువులను కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. ధ్రువీకరణ లేని థర్డ్-పార్టీ విక్రేతలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో భద్రతా ప్రమాణాలను జాగ్రత్తగా పరిశీలించాలని హెచ్చరిస్తున్నారు.

# కాళోజి సేవలు చిరస్మరణీయం



**జహీరాబాద్, సెప్టెంబర్ 9 ప్రజా బలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం కాళోజి నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యలను తన రచనల ద్వారా సమాజం దృష్టికి తీసుకెళ్లిన గొప్ప ప్రజాకవి కాళోజి అని కొనియాడారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి: డిఎస్పీ సైదా

## అన్ని శాఖల సమన్వయంతో వేడుకలు విజయవంతం చేయాలని పిలుపు

**జహీరాబాద్, సెప్టెంబర్ 9 ప్రజాబలం ప్రతినిధి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జహీరాబాద్ డిఎస్పీ సైదా సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం శాంతి కమిటీ, గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ... నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఉత్సవాలు శాంతియుతంగా సాగేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

లిఅన్ని శాఖల పూర్తి సహకారంలి

సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ యూనుస్, కమిషనర్ ప్రభాకర్, తహసిల్దార్ దశరథ్‌లతో పాటు ఆర్అండ్ బి, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు మాట్లాడారు. వేడుకల నిర్వహణకు తమ శాఖల తరఫున పూర్తి సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

లిమత సామరస్యంతో ముందుకు సాగాలి:లి

సీఐ రవి, ఎస్ఐ లవ కుమార్ మాట్లాడుతూ... ఉత్సవాల సందర్భంగా అన్ని మతాల ప్రతినిధులు సమన్వయంతో, ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం మండపాల వద్ద నిర్వాహకులు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలను వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వినయ్ కుమార్, నరేష్, రాజేందర్ రెడ్డి, సంగమేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ మతాల ప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు.

## తెలంగాణ భాష, సంస్కృతి ఆత్మగౌరవానికి కాళోజీ సేవలు చిరస్మరణీయం ..

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను సత్తుపల్లి సింగరేణి ఏరియా జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకటాచారి ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా జీఎంతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు కాళోజీ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల ఆత్మగౌరవం కోసం కాళోజీ తన కలాన్ని ఆయుధంగా మలిచి చేసిన పోరాటాన్ని కొనియాడారు.

"పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది" అనే కాళోజీ స్ఫూర్తిదాయక సందేశాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రజా సమస్యలను తన రచనల ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చిన మహనీయుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ భాషా వైభవాన్ని కాపాడుకోవడంతో పాటు, మాతృభాష పట్ల ప్రతి ఒక్కరిలో మరింత అభిమానం పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

## ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు నోటీసులు.. వార్తలను ఖండించిన ఎన్నికల సంఘం

భారతరత్న గ్రహీత, ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు నోటీసులు జారీ చేసినట్లు వస్తున్న వార్తలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీవ్రంగా ఖండించింది. కర్ణాటకలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా, ఆయన పేరులో అక్షర దోషం ఉందన్న కారణంతో విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది.

పాత ఓటరు జాబితాలో »Prof. C.N.R. Raoµ అని ఉండగా, ప్రస్తుత జాబితాలో »Proff. C.N.R. Raoµ అని అదనంగా 'ట' అక్షరం నమోదైందని, ఈ వ్యత్యాసంపై వివరణ ఇవ్వాలని 92 ఏళ్ల వయస్సున్న శాస్త్రవేత్తకు నోటీసులు పంపినట్లు వివిధ మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో ఈ విచారణ జరగనుందని ఆ కథనాలు సారాంశం.

అయితే, ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో వెల్లడించింది. వాస్తవానికి 2002 నాటి జాబితాలో ఆయన పేరు 'రామ ూ/ూ హెచ్. నగేష్' అని ఉండగా, ప్రస్తుత జాబితాలో 'ప్రొఫ్. సీఎన్ఆర్ రావు ూ/ూ నగేష్ రావ్. హెచ్' అని సవరించబడి ఉందని వివరించింది. దేశానికి ఆయన చేసిన విశిష్ట సేవలను, ఆయనకున్న అత్యున్నత గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు ఆయనకు గానీ, ఆయన కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని ఈసీ స్పష్టం చేసింది.

ఘన స్థితి, నిర్మాణ రసాయన శాస్త్ర రంగాలలో ప్రొఫెసర్ రావు అందించిన సేవలు అపారమైనవి. దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' అందుకున్న మూడో శాస్త్రవేత్తగా ఆయన గుర్తింపు పొందారు. గతంలో ఆయనను పద్మవిభూషణ్, పద్మశ్రీ సహా అనేక ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి.

# కొత్తూరులో కాంగ్రెస్ 1000 రోజుల ప్రజా పాలనపై ఇంటింటి ప్రచారం..

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన డాక్టర్ మట్టా దయానంద్.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన నాయకులు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో వివరించి,





వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

"ప్రజల వద్దకే పాలన.. ప్రతి కుటుంబానికి సంక్షేమం.. ప్రతి గ్రామానికి అభివృద్ధి" అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు తెలిపారు. 1000 రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమల ఆనందబాబు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కొత్తూరు గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




**జహీరాబాద్, సెప్టెంబర్ 9 ప్రజాబలం ప్రతినిధి:** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి'కి బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణతో పాటు శేఖపూర్ మాజీ సర్పంచ్ చిన్నా రెడ్డిలను ఉదయం వారి నివాసాల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకుని, జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గ్రామాల అభివృద్ధి కోసం సొంతంగా అప్పులు తెచ్చి పనులు పూర్తి చేసి మూడేళ్లు గడుస్తున్నా, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వడం చేతకాక, పోలీసులు, అధికారులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యయుత నిరసనలపై ఉక్కుపాదం మోపితే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం ఇకనైనా అణచివేత ధోరణి వీడి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## పౌష్టికాహారం తీసుకుంటేనే పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చు. మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 9:** గర్భిణీలు ప్రతి నెల పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటేనే పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చునని తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కెవి) సూచించారు. బుధవారం తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలోని 2వ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ అనిత అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆకుకూరలతో పాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి సెంటర్ లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా గర్భిణీలు తినాలన్నారు. సాధారణ కాన్పు జరిగే వరకు చూడాలని, తొందరపడి ఆపరేషన్లు చేయించుకోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంతో నిపుణులు కలిగిన వైద్యులు ప్రసవాలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాల ప్రాముఖ్యత గురించి పలువురు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాంబాయి, గ్రామ నాయకులు పొన్నం కృష్ణయ్య, అంగన్వాడి టీచర్ గోవిందు నాగరత్నం, గ్రామ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**జహీరాబాద్, సెప్టెంబర్ 9 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలో మున్సిపల్ అధికారులు రోడ్డు విస్తరణ పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన భవానీ మందిర్ రోడ్డు, హనుమాన్ మందిర్ రోడ్డు విస్తరణ పనులను బుధవారం చేపట్టారు. వ్యాపారస్తులు, దుకాణాల యజమానులు మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వ్యాపారస్తులకు సరైన సమాచారం లేకుండా పనులను ప్రారంభించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని, దుకాణాలను ఖాళీ చేసేంతవరకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యాపారస్తులకు చాలా సమయం ఇవ్వడం జరిగిందని పనులను ప్రారంభించామని వ్యాపారస్తులు తమ సామాగ్రిని తొలగించి రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు.

# విద్యార్థుల కోసం బస్సులు నడపాలి

**జహీరాబాద్, సెప్టెంబర్ 9 ప్రజాబలం ప్రతినిధి:** విద్యార్థుల సౌకర్యార్థం పలు గ్రామాలకు సమయపాలనతో బస్సులు నడపాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ స్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కల్బేమల్, బసంత్ పూర్, మెటల్ కుంట, కాశింపూర్, గోపన్పల్లి, సత్వార్ గ్రామాల నుంచి జహీరాబాద్‌కు వచ్చే విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు అందుబాటులో లేక కళాశాలలు, పాఠశాలలకు ఆలస్యమవుతోందని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి ఈ.గోపాల్ కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయశ్రీ, స్వప్న, అరుణ, సంగీత, వంశీ, మోహన్ పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

## పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 9(ప్రజాబలం ప్రతినిధి)శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

# యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు: బండి సంజయ్

తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.

గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. “నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు” అని భరోసా ఇచ్చారు.

దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ ఫిర్యాదు.

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలపై సత్తుపల్లి బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆయన చావును కోరుకున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, రాజకీయంగా విమర్శలు చేయడంలో తప్పులేదని.. అయితే వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, కేసీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ జోలికి వస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు సహించబోరని హెచ్చరించారు.

ప్రశాంతమైన తెలంగాణలో వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలకు తావివ్వడం సరికాదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ కనుసన్నల్లోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ నిర్ణేతలని పేర్కొంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల ఆగ్రహానికి గురికాకముందే ప్రభుత్వం ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

# స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 09:** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జేవీఆర్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.




ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సుమారు రూ.11 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ప్రభుత్వం వేసే భిక్ష కాదని.. అది వారి హక్కు అని స్పష్టం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ.. ఆ హామీ ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. వెంటనే ఈ పథకాన్ని అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి సారించడం లేదని ప్రవీణ్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు భాను శ్రీకర్ మాట్లాడుతూ.. సత్తుపల్లి డివిజన్‌లోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని అన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సత్తుపల్లి పట్టణంలోని ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ కూలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు.

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే జిల్లాలోని ముగ్గురు మంత్రులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, రామ్‌చరణ్, దీపు, చరణ్, పవన్, మణికంఠ, గౌతమి, త్రిపుర, శైలజతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాళోజీ సాహిత్య స్ఫూర్తితో సమాజ సేవకు పునరంకితం కావాలి

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 9:**తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రముఖ కవి, రచయిత కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవితల ద్వారా సమాజం దృష్టికి తీసుకెళ్లిన కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజల హక్కులు, సామాజిక చైతన్యం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకవర్గం చేత ఘన సన్మానం



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:యెదుగని అంజయ్య :** రాంపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించినట్లు సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం మరియు ఉపాధ్యాయ బృందం చేసిన కృషి వల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 42 నుంచి 77 కు చేరడం జరిగింది అని అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని వారి కృషిని అభినందించడానికి ఈ సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశాన్ని పురస్కరించుకొని పాఠశాల హెచ్ఎం పద్మా రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం చేసిన సన్మానం మా యొక్క బాధ్యతను మరింతగా పెంచింది అని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పద్మా రెడ్డిని ఉపాధ్యాయ బృందం ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి లను సన్మానించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ చంద్రహాస్ ఏఏపీసీ చైర్మన్ యాదమ్మ వార్డు మెంబర్లు సతీష్, బాలరాజు, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్ న్యూస్

## స్టైఫండ్ భారీగా పెంచుతూ జీవో జారీ




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 09 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా:** స్టైఫండ్ భారీగా పెంచుతూ, జీవో జారీ సెక్రెటరియటులో మంత్రిని కలిసి, కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్, విద్యార్థులకు జీవో కాఫీ అందజేసిన, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురల్ పతి విభాగాల్లోని, హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపండ్ , భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ, 13.754, కాగా ఉన్న స్టైఫండ్ , రూ, 29.792,కు పెంచారు, పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34.385.నుంచి,74.482,కు పెరిగింది, స్టైఫండ్ పెంపుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు,ఈరోజు బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్ కు సంబంధించిన జీవో కాపీని అందజేశారు, గత ప్రభుత్వం 10, ఏళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు, అలాంటిది ఇప్పుడు అలోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్ ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు, తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు , ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ తరపున కృతజ్ఞతలు తెలిపారు...

## ఆశ్రమ పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 9:** కాళోజి నారాయణరావు112వజయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు,డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని,వారి భాషను, సంస్కృతిని తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత కవి అని పేర్కొన్నారు. “ప్రజల భాషే నా భాష, ప్రజల బాధలే నా కవిత్వం” పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది అనే భావంతో ఆయన జీవితాంతం ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు.

విద్యార్థులకు కాళోజి జీవితం, సాహిత్యం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర గురించి వివరించారు.విద్యార్థులు కాళోజి రచనలు, కవితలు,సూక్తులను ఆలపించి/పఠించి ఆయనకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ యాస, భాషను గౌరవించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి. శోభన్ నాయక్, బి.రవి, ఎం.చందర్రావు, బి.రవి,పాయం శ్రీనివాస్,బి.సింగ్య,జే.నాగేశ్వరరావు,కే.శ్యామల, బి.శారదాబాయి, డి.ఉషశ్రీ, పాఠశాల విద్యార్థులు,నాలుగో తరగతి ఉద్యోగులు బి.కపుర్య,వీరు,సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం చివరలో కాళోజి ఆశయాలను కొనసాగిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఢిల్లీ వ్యక్తి దీనగాథ.. ఉద్యోగం పోవడంతో ఇంట్లో వంట బంద్ చేసిన భార్య!

ఢిల్లీకి చెందిన 42 ఏళ్ల ఒక వ్యక్తి జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగం కోల్పోవడంతో ఆయన ఆర్థికంగానే కాకుండా, మానసికంగానూ తీవ్రంగా కృంగిపోయారు. ఆ నిరుద్యోగ ప్రభావం ఆయన వ్యక్తిగత జీవితంపై కూడా పడింది. ఇంట్లో పరిస్థితులు విషమించాయని, చివరకు తన భార్య కనీసం వంట చేసి పెట్టడానికి కూడా నిరాకరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

2003 నుంచి కంటెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న రాహుల్, గతంలో 'కెటలైజ్ రీసెర్చ్' అనే మార్కెట్ రీసెర్చ్ సంస్థలో విధులు నిర్వహించేవాడు. అయితే, సంస్థలో జరిగిన సిబ్బంది తగ్గింపు కారణంగా సరైన కారణం లేకుండానే తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆయన తెలిపాడు. గతంలో అధిక వేతనం వచ్చే ఉద్యోగాన్ని వ్యక్తిగత ఒత్తిళ్ల కారణంగా వదులుకున్న ఆయన, వృత్తిపరమైన స్థిరత్వం కోసం తక్కువ జీతానికైనా ఈ సంస్థలో చేరినట్లు వివరించాడు.

# పద్మవ్యూహంలో సిరిసిల్లా

## ఇరుకు సందుల్లో గణేష్ మండపాలు.. ఆపద వస్తే అంతే సంగతులు!

**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 9 (ప్రజాబలం ప్రతినిధి)**చేనేత నగరం సిరిసిల్లలో పండుగకు ఇంకా వారం రోజుల సమయం ఉండగానే వినాయక చవితి హడావుడి హద్దులు దాటుతోంది. ఉత్సవ కమిటీ నిర్వాహకుల అతి ఉత్సాహం పట్టణ ప్రజలకు శాపంగా మారుతోంది. వారం ముందే రోడ్లను తవ్వేసి, రాకపోకలను స్తంభింపజేస్తూ నిర్మిస్తున్న భారీ మండపాలు అంతర్గత వీధుల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. భక్తి ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కుతూ వేస్తున్న పందిళ్లతో గల్లీలన్నీ పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి.వారం ముందే రోడ్ల దిగ్బంధం.. నిర్వాహకుల అతి ఉత్సాహం పండుగ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలనే తాపత్రయంతో నిర్వాహకులు వారానికి ముందే రోడ్లను తమ అధీనంలోకి తీసుకుంటున్నారు.రోడ్ల , సీసీ రోడ్లు, తారు రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి పెద్ద పెద్ద గుంజలు నాటుతుండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.




ట్రాఫిక్ నరకం వారం రోజుల ముందు నుంచే వాహనదారులు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.పోటీ తత్వంతో పక్క గల్లీ కంటే మా మండపమే పెద్దగా ఉండాలనే పోటీతో రోడ్డును పూర్తిగా ఆక్రమించి పందిళ్లు వేస్తున్నారు.అగ్ని ప్రమాదం జరిగితే దిక్కెవరు?

సిరిసిల్లలోని పాత బస్తీ, బీబీనగర్, గాంధీనగర్, సుభాష్ నగర్ లాంటి అత్యంత రద్దీ ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు పట్టుమని పది అడుగులు కూడా ఉండదు. అలాంటి సందుల్లో ఏకంగా రోడ్డుకు అడ్డంగా భారీ మండపాలు, మైక్ సెట్లు, జనరేటర్లు అమర్చుతున్నారు. ఒకవేళ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజిన్ లోపలికి వెళ్లడం అసాధ్యం.అంబులెన్స్‌కూ నో ఎంట్రీ మండపాల విస్తరణ వల్ల 108 అంబులెన్స్ కాదు కదా, కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. అత్యవసర సమయాల్లో ప్రాణాపాయం సంభవిస్తే బాధితులను ఆసుపత్రికి చేర్చడం దాదాపు అసాధ్యంగా మారింది. పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక శాఖల సమన్వయ లోపం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. పండుగకు ముందే ఇంతలా ఇబ్బందులు పెడుతున్నా అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదం జరిగాక సమీక్షలు నిర్వహించడం కంటే, ముందే మేల్కొని నిబంధనలు అతిక్రమించిన మండపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలకు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరి. తల్లాడ ఎస్సై వెంకటేష్



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 9:**తల్లాడ మండలం గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల కీలక సూచనలు చేశారు.తల్లాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు ముందస్తు అనుమతులు పొందాలని తల్లాడ ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ కేటాయించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని అనుమతి పొందాలి.

విద్యుత్ ప్రమాదాల నివారణ మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైరింగ్ ఉపయోగించి, విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి.


శాంతిభద్రతల పరిరక్షణ  మండపం వద్ద ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, 24 గంటలూ పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలి.

డిజెలకు అనుమతి లేదు శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు డిజె డీజే) సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత పరిమితిలో సౌండ్ బాక్సులను మాత్రమే ఉపయోగించాలి.

అగ్నిమాపక జాగ్రత్తలుఅగ్ని ప్రమాదాలు జరగకుండా మండపాల వద్ద తగినన్ని నీటి సదుపాయాలు మరియు ఇసుక బకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి.

ట్రాఫిక్ సమసయ్యలు లేకుండా చూడటం: ప్రధాన రహదారులు, రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి.శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఎస్సై వెంకటేష్ వివిధ గ్రామస్తులతో మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేష్ కుమార్, పిచ్చయ్య ,లక్ష్మణ్, వివిధ గ్రామ ప్రజలందరికీ పలు సూచనలు వివరించారు.

# నేడు తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** కాళోజి రావు జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తూ, ఆ మహనీయుని ఆలోచనలో కొంతవరకైనా నడవాలని ఆకాంక్షిస్తూ, వారి యాదిలో అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే, నా గొడవకు ముక్తి ప్రాప్తి, అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకారాధ్యుడు, అంటూ గొడవ పెట్టి, రాజకు ఆచరణకు తేడా చూపక జీవించిన , తెలంగాణ సాహితి దిగ్గజం, కాళోజి బాటలో నడుద్దాం వారి ఆశయ సాధనకు కృషి చేద్దాం.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449